క్లుప్తంగా

ఆలయం వద్ద అన్న సమారాధన



అమ్మవారిని దర్శించుకుంటున్న పృథ్వీరాజ్

కపిలేశ్వరపురం: కోరుమిల్లిలో కొలువైన శ్రీమహాలక్ష్మి అమ్మవారి ఆలయం వద్ద మంగళవారం అన్న సమారాధన నిర్వహించారు. అమ్మవారిని విశేషంగా అలంకరించారు. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు తనయుడు తోట పృథ్వీరాజ్ అమ్మవారిని దర్శించుకున్నారు. కోరుమిల్లి, మాచర, వాకతిప్ప తదితర గ్రామాల భక్తులు అమ్మవారిని దర్శించుకుని, మొక్కులు తీర్చుకున్నారు.

ఘనంగా కట్లమ్మ జాతర

కపిలేశ్వరపురం: మండలంలోని తాతపూడిలో సోమవారం రాత్రి కట్లమ్మ జాతర ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని విశేషంగా అలంకరించారు. డప్పు వాయిద్యాలు, గరగ నృత్యాలతో గ్రామ వీధుల్లో జాతర సందడిగా సాగింది. సుదూర ప్రాంతాల్లో స్థిరపడిన గ్రామానికి చెందిన ఆడపడుచులు అమ్మవారిని దర్శించుకుని, మొక్కులు తీర్చుకున్నారు. మంగళవారం ఆలయం వద్ద తీర్థం నిర్వహించారు. సెలవు రోజులు కావడంతో విద్యార్థులు తీర్థంలో సందడి చేశారు.

టీకాల వివరాలు ఆన్‌లైన్ చేయాలి

కపిలేశ్వరపురం: క్షేత్ర స్థాయిలో టీకాలు వేసిన తర్వాత గర్భిణులు, చిన్నారుల వివరాలను యువిన్ పోర్టల్‌లో విధిగా నమోదు చేయాలని జిల్లా వైద్యాధికారి కార్యాలయం టీకాల విభాగం ఎంపీహెచ్ఎస్ బోసు, వ్యాక్సిన్ మేనేజర్ సునీల్ తెలిపారు. ఈ అంశంపై స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం యువిన్ ఓవర్ డ్యూస్ పేరుతో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆయా వివరాలను పోర్టల్‌లో నమోదు చేసే సాంకేతిక పద్ధతులపై అంగర, వాకతిప్ప, అచ్యుతాపురం పీహెచ్‌సీల సూపర్‌వైజర్లు, వైద్యారోగ్య కార్యకర్తలకు అవగాహన కల్పించారు. ప్రణాళికాబద్ధంగా కార్యాచరణ చేపట్టాలని, సాంకేతిక సమస్యలు తలెత్తితే డీఎంహెచ్ఓ కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ఆయా పీహెచ్‌సీల ఎంపీహెచ్ఈఓలు జిత్తుక మల్లికార్జునుడు, గోపాలకృష్ణ, ఎంపీహెచ్ఎస్ కామేశ్వరరావు, హెచ్ఈ బి.రామారావు, హెల్త్ విజిటర్ తాతపూడి మేరీమణి తదితరులు పాల్గొన్నారు.

కుల ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయాలి

రాయవరం: ఎస్సీ కుల ధ్రువీకరణ పత్రాలను త్వరితగతిన మంజూరు చేయాలని ఎస్సీ, ఎస్టీ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఖండవిల్లి భరత్‌కుమార్ కోరారు. ఈ మేరకు తహసీల్దారు ఐపీ శెట్టికి మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఎస్సీలను గ్రూపు-1, గ్రూపు-2, గ్రూపు-3 కేటగిరీలుగా ప్రభుత్వ ఆర్డినెన్స్ ద్వారా వర్గీకరించినందున ఆ మేరకు కుల ధ్రువీకరణ పత్రాలను మంజూరు చేయాలన్నారు. ప్రస్తుతం డీఎస్సీ-2025 నోటిఫికేషన్ ప్రకారం దరఖాస్తు చేసుకుంటున్న అభ్యర్థులకు కుల ధ్రువీకరణ పత్రాలు అవసరమని చెప్పారు. కేటగిరీల వారీగా కుల ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయకపోతే ఉద్యోగ అవకాశాలు కోల్పోయే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణం స్పందించి, సమస్యను పరిష్కరించాలని కోరారు.

వైద్య శిబిరం

కపిలేశ్వరపురం (మండపేట): ఐడియల్ యూత్ మూవ్‌మెంట్ (ఐవైఎం) ఆధ్వర్యంలో మండపేట పట్టణం గాంధీనగర్ మసీదు వద్ద మంగళవారం వైద్య శిబిరాన్ని నిర్వహించారు. 102 మందికి థైరాయిడ్, ఇతర పరీక్షలను చేసినట్టు సంస్థ అధ్యక్షుడు అబ్దుల్ హమీద్ తెలిపారు. కార్యక్రమంలో జమాత్ అధ్యక్షులు ఫారుఖ్ ఆలీ, కార్యదర్శి జాబిర్, రెహ్మాన్, మున్నా, హుస్సేన్, కరీం పాల్గొన్నారు.

ఈ-శ్రమ్‌లో నమోదు కావాలి

కపిలేశ్వరపురం (మండపేట): ప్రతి కార్మికుడు ఈ-శ్రమ్ పోర్టల్‌లో నమోదయ్యేలా కృషి చేస్తున్నట్టు మండపేట సహాయ కార్మికాధికారి కాశిన శివనాగమల్లేశ్వరరావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండపేట సమీప గ్రామాల్లోని ఇటుక బట్టీల కార్మికులను ఈ-శ్రమ్‌లో చేరే దిశగా దృష్టి సారించామన్నారు. ఇప్పటికే ఆలమూరు ఇటుక బట్టీ నిర్వాహకుల సంఘ నాయకులతో సంప్రదించి, సంధిపూడి, ఆలమూరు, పెదపల్ల, పినపల్ల, జొన్నాడ గ్రామాల్లో క్షేత్ర స్థాయి సమావేశాలను నిర్వహిస్తామన్నారు.

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

రాయవరం: తమకు అందిన సమాచారంతో స్థానిక మెయిన్‌రోడ్డులోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయం ఎదురుగా ఉన్న భవనంలో పేకాట ఆడుతున్న వ్యక్తులపై పోలీసులు మంగళవారం దాడి చేశారు. ఎస్సై డి.సురేష్‌బాబు వివరాల మేరకు, వివిధ గ్రామాలకు చెందిన వ్యక్తులు ఓ ఇంటిలో పేకాట శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు అందిన సమాచారంతో పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో రాయవరానికి చెందిన కిలపర్తి సత్యనారాయణ, కర్రి వెంకన్నబాబు, వుండవిల్లి శివరామకృష్ణ, చేకూరి రామకృష్ణ, కుందుం వీరవెంకటసుబ్రహ్మణ్యం, చింతపల్లికి చెందిన మేక వీరవెంకట సత్యనారాయణ, ముత్తిన వీరవెంకట సత్యనారాయణ, రామవరానికి చెందిన సబ్బెళ్ల వీర్రెడ్డి, జి.మామిడాడకు చెందిన కొవ్వూరి సూర్యనారాయణ, మహేంద్రవాడకు చెందిన ఖండవిల్లి అబ్బులును అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద నుంచి రూ.20,750 నగదు, 10 సెల్‌ఫోన్లు, రెండు మోటార్ సైకిళ్లు, రెండు రౌండ్ టేబుళ్లు, 15 కుర్చీలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

మున్సిపల్ పాలన అస్తవ్యస్తం

- ఆక్రమణలను అడ్డుకోలేని స్థితిలో అధికారులు
- మున్సిపల్ కార్యాలయం సమీపంలో మద్యం షాపు
- అధికారుల తీరుపై ఎమ్మెల్సీ తోట మండిపాటు
- నిబంధనలను విస్మరిస్తున్నారంటూ రాజుబాబు ఆగ్రహం
- మండపేట మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం



మున్సిపల్ స్థలం ఆక్రమణపై కమిషనర్‌ను ప్రశ్నిస్తున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

కపిలేశ్వరపురం (మండపేట): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మండపేట పట్టణ మున్సిపల్ పాలన అస్తవ్యస్తంగా మారిందని, ప్రైవేటు వ్యక్తులు మున్సిపల్ స్థలాలను ఆక్రమిస్తున్నా పట్టించుకోని స్థితిలో అధికారులున్నారని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు మండిపడ్డారు. సత్యశ్రీ రోడ్డులో వాటర్ వర్క్స్ స్థలం ఆక్రమణను ఆయన ఉదహరించారు. మున్సిపల్ నిబంధనలను కనీసం పట్టించుకోని రీతిలో అధికారుల తీరు ఉందంటూ కో-ఆప్షన్ సభ్యుడు రెడ్డి రాధాకృష్ణ ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక మున్సిపల్ కౌన్సిల్ సమావేశ మందిరంలో మంగళవారం కౌన్సిల్ అత్యవసర సమావేశం నిర్వహించారు. చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి అధ్యక్షతన ఈ సమావేశం వాడీవేడిగా సాగింది. తొలుత సమావేశం అజెండా సారాంశాన్ని కమిషనర్ రంగారావు చదివారు. అనంతరం 21 అంశాలపై సభ్యులు చర్చించారు.



సమావేశం నిర్వహిస్తున్న చైర్‌పర్సన్ దుర్గారాణి



అధికారుల నిర్లక్ష్యాన్ని ఎండగడుతున్న రెడ్డి రాజుబాబు

అధికారుల అలసత్వంతోనే ఆక్రమణ

వాటర్ వర్క్స్ స్థలాన్ని ప్రైవేటు వ్యక్తి ఆక్రమించడంపై అధికారులు ఏమాత్రం చర్యలు తీసుకోకపోవడంతో ఎమ్మెల్సీ తోట ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్సిపల్ స్థలంలో ప్రైవేటు వ్యక్తి నిర్మించిన ఆక్రమణ గోడను గతంలో తొలగించినప్పటికీ, అదే ప్రదేశంలో మరోసారి ఆక్రమణదారుడు గోడను నిర్మించాడంటే అధికారుల తీరు ఏ పాటిదో అవగతమవుతోందని ఎద్దేవా చేశారు. దానిపై సంబంధిత అధికారులు మాట్లాడుతూ, మున్సిపల్ రికార్డులు లభ్యం కాకపోవడంతో ఇబ్బంది తలెత్తిందన్నారు. సమయానికి మున్సిపల్ రికార్డులు అందుబాటులో లేకపోయినప్పుడు ఆక్రమించుకున్న ప్రైవేటు వ్యక్తి వద్ద ఉన్న రికార్డులను పరిశీలించి ఆక్రమణలను తొలగించాలి కదా అని అధికారులను ఎమ్మెల్సీ తోట ప్రశ్నించారు. ఆ మేరకు తక్షణం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మున్సిపల్ స్థలాన్ని ఆక్రమించిన వ్యక్తి, ఆక్రమణ తొలగించకుండా అధికారులను చుట్టూ తిప్పుకోవడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోందన్నారు. వెంటనే ఆక్రమణ గోడను తొలగించాలని అధికారులకు స్పష్టం చేశారు.

జనావాసాల్లో మద్యం షాపులు

మున్సిపల్ కార్యాలయం సమీపంలో మద్యం షాపును ఏర్పాటు చేయడం ఈ ప్రభుత్వ తీరుకు నిదర్శనమని ఎమ్మెల్సీ తోట అన్నారు. 2019-24 మధ్య వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో మద్యం షాపులు శివారు ప్రాంతంలోనే ఉండేవని, ప్రస్తుత కూటమి పాలనలో మున్సిపల్ కార్యాలయం, జనావాసాల మధ్య ఏర్పాటు చేశారన్నారు. మున్సిపల్ కార్యాలయం సమీపంలో ఉన్న మద్యం షాపును తొలగించాలని తీర్మానం చేయడమే కాకుండా, ఈ కాపీని జిల్లా కలెక్టర్, ఎక్సైజ్ అధికారులకు పంపాలని నిర్దేశించారు.

రూ.50 వేల పెంపు భారమే..

మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ గౌరవ వేతనాన్ని నెలకు రూ.15 వేల నుంచి రూ.50 వేలకు పెంచాలన్న ప్రభుత్వ ఉత్తర్వులపై ఎమ్మెల్సీ తోట, కౌన్సిలర్లు అభ్యంతరాలను వ్యక్తం చేశారు. కౌన్సిల్ లీగల్ సమస్యలను వాదించేందుకు నెలకు రూ.50 వేలు వెచ్చిస్తే కౌన్సిల్‌పై తీవ్రమైన భారం పడుతుందంటూ తీర్మానం చేసి ప్రభుత్వానికి పంపాలని నిర్ణయించారు.

వైఎస్సార్ నగర్ పేరుతో వ్యవహరించాలి

15, 20వ వార్డులకు సంబంధించిన 8వ నంబర్ సచివాలయం ధర్మగుండం వీధిలో ఉండటంతో 20వ వార్డు ప్రజలకు దూరాభారమైందని, సచివాలయాన్ని టిడ్కో హౌసింగ్ భవనంలోకి మార్చాలని ప్రతిపాదించారు. ఆ సమయంలో ఎమ్మెల్సీ తోట మాట్లాడుతూ, 20వ వార్డు ప్రాంతాన్ని వైఎస్సార్ నగర్‌గా ప్రభుత్వ కార్యకలాపాల్లో వ్యవహరించాలని, ఆ మేరకు గత ప్రభుత్వం ప్రత్యేక ఉత్తర్వులను ఇచ్చిందన్న సంగతి అధికారులు మరువవద్దని సూచించారు.

రహదారి ఆక్రమణలపై చర్యలేవి?

మండపేట-ఏడిద రహదారిలో ఆక్రమణలను తొలగించాలని గతంలో సమావేశం దృష్టికి తీసుకొచ్చారని, వాటిని తొలగించారా అని కో-ఆప్షన్ సభ్యుడు రెడ్డి రాధాకృష్ణ ప్రశ్నించినప్పుడు అధికారులు నీళ్లు నమిలారు. ప్రజాప్రయోజనాలకు ఆటంకంగా మారిన ఆక్రమణలను తొలగించే విషయంలో అధికారులు ఎందుకు అలసత్వం వహిస్తున్నారో అర్థం కావడం లేదన్నారు.

సెటిల్‌మెంట్లలో మున్సిపల్ సిబ్బంది

ప్రైవేటు స్థలాల్లో ఇల్లు నిర్మించుకునేందుకు మున్సిపల్ అనుమతులు కోరే క్రమంలో టౌన్ ప్లానింగ్ విభాగం సిబ్బంది ప్రైవేటు సెటిల్‌మెంట్లు చేస్తున్నారని సభ్యులు ఆరోపించారు. 29వ వార్డులో ఓ యజమాని ఇల్లు నిర్మించుకునేందుకు మున్సిపల్ అధికారులను అనుమతి కోరుతున్న క్రమంలో.. సమీపాన ఉన్న మరో ప్రైవేటు వ్యక్తి అందుకు ఇబ్బంది పెట్టాడని, ఆ సమస్య పరిష్కారమై అనుమతి రావాలంటే ఆ వ్యక్తికి రెండు గజాల స్థలం కలపాలంటూ టౌన్ ప్లానింగ్ అటెండర్ బేరసారాలు నడిపాడని ఆరోపించారు. దానిపై అటెండర్‌ను పిలిచి మందలించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి మాట్లాడుతూ కౌన్సిల్ చేసిన తీర్మానాలను అమలు చేసేందుకు అధికారులు సరైన రీతిలో కృషి చేయాలని ఆదేశించారు.

అన్ని వసతులతో స్పోర్ట్స్ స్టేడియం

కపిలేశ్వరపురం (మండపేట): నియోజకవర్గంలో అన్ని వసతులతో సమర్థవంతమైన ఇండోర్, అవుట్ డోర్ స్టేడియాలను ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నట్టు ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు తెలిపారు. ఇందుకు ప్రతిపాదనలు పంపిన నేపథ్యంలో మండపేట స్పోర్ట్స్ కౌన్సిల్ సభ్యులు మంగళవారం ఆయనను సత్కరించారు. ప్రభుత్వ ఉద్యోగులు, రైటైర్డ్ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, వ్యాయమ ఉపాధ్యాయులతో ఏర్పాటైన ఈ సంస్థ సభ్యులు స్టేడియంలో కోర్టుల నిర్మాణం, ఇతర సదుపాయాల కల్పనపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సభ్యులు గొడ్డి రాంబాబు, సంకా రంగ, ఆర్ నాగకుమార్, నాగేశ్వరరావు, చేకూరి కృపారావు, ప్రెస్ క్లబ్ అధ్యక్షులు వేమగిరి నూకరాజు, ఏపీడబ్ల్యూజేఎఫ్ అధ్యక్షులు నరాల రమేష్, క్రీడాకారుడు వర్మ పాల్గొన్నారు.



ఎమ్మెల్యేను సత్కరిస్తున్న స్పోర్ట్స్ కౌన్సిల్ సభ్యులు

ఎల్లవేళలా అండగా ఉంటా

ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

రామచంద్రపురం: రాజకీయంగా తాను పుట్టింది రామచంద్రపురం నియోజకవర్గమని, తాను ఎక్కడికి వెళ్లినా ఎల్లవేళలా అండగా ఉంటానని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. పట్టణంలోని కాపు కల్యాణ మండపంలో మంగళవారం రామచంద్రపురం పట్టణ కాపు సంఘ సమావేశానికి త్రిమూర్తులు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కాపు సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా తొగరు బ్రహ్మాజీ, గౌరవాధ్యక్షులుగా అరిగెల నాగేశ్వరరావు, పెమ్మన బోయిన సత్యనారాయణ, ఉపాధ్యక్షులుగా మట్టా దుర్గారావు, అక్కిరెడ్డి శ్రీను, ఆకుల పెద్ద, కార్యదర్శిగా పిట్టా నాని, కోశాధికారిగా అంకం శ్రీనివాస్, సలహాదారులుగా పోలిశెట్టి శ్రీనివాస్, నారపురెడ్డి బలరాం, పెంటపాటి శ్రీను, పసుపులేటి సత్తిబాబు, వడ్డి ఉదయభాను, పోతంశెట్టి కృష్ణ తదితర కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా త్రిమూర్తులు మాట్లాడుతూ, కొత్తగా ఎన్నికైన కార్యవర్గం కాపు సంఘానికి మంచి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని ఆకాంక్షించారు. కాపు సంఘం అభివృద్ధికి సహకరిస్తానని తెలిపారు. జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



కాపు సంఘం అధ్యక్షుడు బ్రహ్మాజీని అభినందిస్తున్న తోట త్రిమూర్తులు

ధాన్యం కొనుగోళ్లలో రైతులకు అన్యాయం

జెడ్పీటీసీ సభ్యురాలు కుడుపూడి భవాని



కపిలేశ్వరపురం (మండపేట): ధాన్యం కొనుగోలు ప్రక్రియలో కూటమి ప్రభుత్వం రైతులకు అన్యాయం చేస్తోందని మండపేట జెడ్పీటీసీ సభ్యురాలు కుడుపూడి భవాని మంగళవారం ఆవేదన వ్యక్తం చేశారు. రబీ సాగు చివరి దశలో ఒకవైపు వాతావరణం తరచూ ఆందోళనకు గురి చేస్తుండగా, మరోవైపు ప్రభుత్వం ఇబ్బందులపాలు చేస్తోందన్నారు. రైతు సేవా కేంద్రానికి ధాన్యం తీసుకెళ్తుంటే తమ కేంద్రానికి కొనుగోలు లక్ష్యం పూర్తయిందని, మరోచోటకు తీసుకెళ్లాలని చెబుతున్నట్టు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారన్నారు. సుమారు 4 వేల ఎకరాల ఆయకట్టు ఉన్న ఏడిద గ్రామంలో ఇప్పటి వరకూ 40 శాతం మాత్రమే కొనుగోలు చేశారని, మిగిలిన ధాన్యాన్ని ఏం చేసుకోమని ప్రభుత్వం చెబుతోందో అర్థం కావడం లేదన్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ప్రతి గింజనూ రైతు భరోసా కేంద్రం ద్వారా కొనుగోలు చేశారని గుర్తు చేశారు. ప్రస్తుతం జరుగుతున్న కొనుగోలు తీరుపై కూటమి నేతలు, అధికారులు స్పందించాలన్నారు. ప్రభుత్వ నిబంధనలు మేరకు ఈ-క్రాప్ చేయించుకున్నప్పటికీ, ధాన్యాన్ని కొనేందుకు ప్రభుత్వం ముందుకు రాకపోవడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు.

ఉగ్ర దాడికి నిరసనగా మానవహారం



మానవహారం నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

రాయవరం: మండలంలోని సోమేశ్వరంలో సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం అంగన్‌వాడీ కార్యకర్తలు మానవహారం నిర్వహించారు. ఇటీవల జమ్ము-కశ్మీర్‌లో ఉగ్రవాదులు చేసిన దాడికి నిరసనగా ర్యాలీ చేశారు. సీఐటీయూ మండల కన్వీనర్ డి.ఆదిలక్ష్మి మాట్లాడుతూ, భిన్నత్వంలో ఏకత్వంతో కూడిన దేశంలో ఉగ్రవాదులు చేసిన దాడిని పిరికిపందల చర్యగా అభివర్ణించారు. కశ్మీర్ అందాలను తిలకించేందుకు వెళ్లిన అమాయక ప్రజలను పొట్టన పెట్టుకున్న తీవ్రవాదులను కఠినంగా శిక్షించాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్ల నేతలు సత్యవేణి, కమల, అరుణ, మిడ్ డే మీల్ వర్కర్స్ యూనియన్ నాయకులు త్రివేణి తదితరులు పాల్గొన్నారు.

కామెర్ల మందు సృష్టికర్తకు అవార్డు ఇవ్వాలి



వెల్ల కామెర్ల వైద్య నిలయం ఎన్‌జీఓ లాంచ్ చేసిన కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ, మంత్రి సుభాష్, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు తదితరులు

- ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు
- ఘనంగా వెల్ల కామెర్ల వైద్య నిలయం శతాబ్ది ఉత్సవం

రామచంద్రపురం రూరల్: కామెర్ల వైద్యానికి దేశవ్యాప్తంగా పేరు పొందిన వెల్ల మందు సృష్టికర్త గుండుబోగుల సూర్యారావు పేరుతో నెలకొల్పిన కామెర్ల వైద్య నిలయం వందేళ్లకు పైగా వ్యాధిగ్రస్తులకు సేవలందిస్తోంది. ఈ సందర్భంగా మంగళవారం గుండుబోగుల సూర్యారావు కామెర్ల వైద్య నిలయం శతాబ్ది ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ త్రిమూర్తులు మాట్లాడుతూ, నిస్వార్థంగా సేవలందిస్తూ లక్షలాది మంది కామెర్ల వ్యాధిగ్రస్తుల ప్రాణాలు కాపాడిన గుండుబోగుల సూర్యారావుకు కేంద్రం పద్మ అవార్డు ఇవ్వాల్సిన అవసరం ఉందని కేంద్ర మంత్రిని కోరారు. దీనికి కేంద్ర మంత్రి స్పందిస్తూ, తప్పకుండా పద్మ అవార్డు రావడానికి ప్రధానితో మాట్లాడతానని హామీ ఇచ్చారు. రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు, ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, ఎమ్మెల్సీ సోము వీర్రాజు తదితరులు మాట్లాడుతూ, గుండుబోగుల సూర్యారావు,తర్వాత గుండుబోగుల నాగయ్య, పాముల వీర్రాజమ్మ, గుండుబోగుల స్వామినాయుడు, వారి వారసులు నిస్వార్థంగా అందిస్తున్న సేవలను కొనియాడారు. అనంతరం అతిథులు ఎన్‌జీఓను, వెబ్‌సైట్‌ను లాంచ్ చేశారు. ఎంపీపీ అంబటి భవాని, రామచంద్రపురం మున్సిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, సర్పంచ్ వీరబోయిన సూరిబాబు, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

మానవ తప్పిదాల వల్లే రోడ్డు ప్రమాదాలు

కాజులూరు: రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా మానవ తప్పిదాల వల్లే జరుగుతున్నాయని గొల్లపాలెం ఎస్సై ఎం.మోహన్‌కుమార్ అన్నారు. మంగళవారం గ్రామంలోని కాకినాడ-కోటిపల్లి రహదారిపై, గొల్లపాలెంలోని కాజులూరు జంక్షన్ వద్ద నాకాబందీ నిర్వహించారు. నంబరు ప్లేట్లు సక్రమంగా లేని వాహనాలు, రికార్డులు సరిగా లేనివారు, మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న వారిపై కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మోహన్‌కుమార్ వాహనదారులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. వాహనాలు నడిపే సమయంలో నిబంధనలు పాటించకపోవటం వలన ఇతరులకు ఇబ్బందులు తలెత్తుతాయన్నారు. ప్రయాణికులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

నేడు మండపేటలో జాబ్‌మేళా

అమలాపురం రూరల్: ఆలమూరులో కృష్ణ ప్రభాస్ పేపర్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో ట్రైనీస్ పేపర్ మేకింగ్ ప్రాసెస్ ఎలక్ట్రానిక్ బాయిలర్ ఆపరేటర్స్ 23 పోస్టులు కేవలం బాలురతో భర్తీ చేయడానికి బుధవారం ఉదయం 10 గంటల నుంచి ఎస్వీపీఆర్ఎం ఐటీఐ మండపేటలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి ఈ. వసంత లక్ష్మి మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఐటీఐ లేదా ఏదైనా ట్రేడ్ డిప్లమా బీటెక్ ఎలక్ట్రికల్ అండ్ మెకానికల్ ఇంజినీరింగ్ అర్హత ఉండి, 18 నుంచి 35 సంవత్సరాల లోపు వయసు ఉండాలన్నారు. ఆలమూరు మండలం పినపళ్ళలో పనిచేయాల్సి ఉంటుందని, జీతం రూ.12,000 నుంచి రూ.16,000 వరకు ఉండి క్యాంటీన్ సదుపాయం ఉందని ఈపీఎస్, ఈఎస్ఐ సౌకర్యాలు ఉన్నాయని ఆమె తెలిపారు.

నేడు లక్ష్మీనరసింహుని చందనోత్సవం

కాజులూరు: ఆర్యావటం శివారు చందాలవారిపేటలో బుధవారం శ్రీవరాహ లక్ష్మీనరసింహస్వామి(సింహాద్రి అప్పన్న) ప్రథమ చందనోత్సవానికి ఏర్పాట్లు చేసినట్టు నిర్వాహక కమిటీ సభ్యులు తెలిపారు. వేద పండితుల ఆధ్వర్యంలో తెల్లవారుజామున ఐదు గంటల నుంచి స్వామి వారికి ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఉదయం ఏడు నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకూ స్వామివారి నిజరూప దర్శనం కల్పిస్తారు. సాయంత్రం ప్రధాన హోమం, చందన సమర్పణ, తిరుకల్యాణోత్సవం, పూర్ణాహుతి తదితర కార్యక్రమాలు నిర్వహిస్తారు. భక్తులకు అన్ని వసతులు కల్పించారు. ఆలయ ప్రాంగణంలో అన్న సమారాధన జరుగుతుంది.

గుట్టంతా మట్టిలోనే..

- భూసార పరీక్షలకు వ్యవసాయ శాఖ సన్నద్ధం
- క్లస్టర్ పరిధిలో 5,724 మట్టి నమూనాలు లక్ష్యం
- సాగు పెట్టుబడి, దిగుబడిపై ప్రభావం!

రాయవరం: ఆరుగాలం శ్రమించిన రైతన్న పండించిన పంట చేతి కందకపోయినా, దిగుబడి తగ్గినా పడ్డ కష్టానికి ఫలితం రాదు. రైతులు పండించిన పంటకు అనుగుణంగా దిగుబడి రావాలంటే భూసారాన్ని తెలుసుకోవాలి. ఆ మేరకు పంటలు వేసి, ఎరువులు, రసాయన మందులు వాడినపుడే మేలైన దిగుబడులు సాధించవచ్చని శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. భూసార పరీక్షలను తెలుసుకునే సమయం ఆసన్నమైంది. రబీ సీజన్ పూర్తి కావస్తుండడంతో వ్యవసాయ శాఖ మట్టి పరీక్షలకు క్లస్టర్ పరిధిలో వ్యవసాయ శాఖాధికారులు సిద్ధమవుతున్నారు.

రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల పరిధిలోని మండపేట, కపిలేశ్వరపురం, కె.గంగవరం, రాయవరం, రామచంద్రపురం మండలాల్లో మట్టి పరీక్షలకు వ్యవసాయాధికారులు సిద్ధమవుతున్నారు. క్లస్టర్ పరిధిలో 5,724 మట్టి నమూనాలు సేకరించడం లక్ష్యంగా ఉంది.

ఎందుకంటే?

పొలం నుంచి సేకరించిన మట్టిని వివిధ భౌతిక, రసాయన పద్ధతుల ద్వారా విశ్లేషించి, ఎంత మోతాదులో ఎరువులు, రసాయన మందులు వాడాలో తెలుసుకోవడమే భూసార పరీక్ష ముఖ్య ఉద్దేశం. పంటలో స్థిరమైన దిగుబడులు, నాణ్యమైన ఉత్పత్తి సాధించడానికి ఉపకరిస్తాయి. రైతులు అవసరానికి మించి ఎరువులు, రసాయన మందులు వాడడం వలన నాణ్యమైన దిగుబడులు రాకపోగా, చీడపీడల ఉధృతి, వాతావరణ కాలుష్యం, నేల చౌడుబారడం తదితర సమస్యలు అధికమవుతున్నాయి. ఇటువంటి వాటిని అధిగమించాలంటే నేల భౌతిక, రసాయన లక్షణాలు తెలియ జేసే భూసార పరీక్షలు చేయించుకోవాలి. ఫలితాల ఆధారంగా అవసరం మేరకే ఎరువులు వాడాలి.



మట్టి పరీక్షలకు నమూనాలు సేకరిస్తున్న వ్యవసాయ సిబ్బంది

సేకరించే విధానం

ఆరు లోతులో మట్టి నమూనా తీయాలి. చౌడు, ఆమ్ల నేలల్లో అడుగు లోతులో ప్రతి ఆరు అంగుళాలకు ఓ నమూనా తీయాలి. నేలపై ఉన్న గడ్డి, చెత్త, కలుపు తదితర వాటిని తొలగించాలి. పొలంలో 'వి' ఆకారంతో గోతులు తీయాలి. గొయ్యి అంచుల నుంచి పారతో లేదా తాపీతో మట్టిని సేకరించాలి. పొలంలో 8-10 చోట్ల ఈ పద్ధతిలో మట్టి తీయాలి.


ప్రయోజనాలివీ..

- పొలంలో పోషకాల స్థాయి తెలుస్తుంది.
- పొలాల్లో ఏ పంటలు పండించాలో తెలుసుకోవచ్చు.
- ఎరువులను ఎంత మోతాదులో, ఎప్పుడు వేయాలో తెలుస్తుంది.
- నేల స్వభావం తెలుస్తుంది.
- ఎరువుల వాడకంపై అనవసర ఖర్చు తగ్గించవచ్చు.
- అధిక దిగుబడులకు దోహదపడుతుంది.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

పంట కోత తర్వాత మట్టి నమూనాలు సేకరించాలి. వేసవిలో, పంటలేని సమయాల్లోనే మట్టి నమూనాలు సేకరించాలి. ఎరువులు వేసిన తర్వాత నెల రోజులదాకా, నీరు పెట్టిన తర్వాత తీయకూడదు. నీడ పడే ప్రదేశాలు. నీటి ముందు ప్రాంతాలు, పెంట పోగులు, గట్లు, చెట్ల దగ్గర మట్టి నమూనాలు ఎట్టి పరిస్థితుల్లోనూ సేకరించరాదు. పొలానికి ఓ నమూనా మాత్రమే తీయాలి. పొలం ఎక్కువ విస్తీర్ణంలో ఉంటే ప్రతి 2 నుంచి 5 ఎకరాలకు ఒకటి సేకరించవచ్చు. నేల నిర్మాణం, రంగు, మురుగు పారుదల సౌకర్యం, నేల వాలు, చౌడు, క్షార, ఆమ్ల గుణాలు తదితర విషయాల్లో తేడా కనిపిస్తే, అన్ని నమూనాలు ఆయా పొలాల నుంచి తీయాలి.

రైతులు సద్వినియోగం చేసుకోవాలి



ఈ ఏడాది భూసార పరీక్షలు చేసేందుకు ఆదేశాలు వచ్చాయి. క్షేత్ర స్థాయిలో భూసార పరీక్షలు నిర్వహించి, ప్రత్యేక యాప్‌లో ఫలితాలను అప్‌లోడ్ చేస్తాం. భూసార పరీక్షలు చేయించుకునే రైతులు రైతు సేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

– కొప్పిశెట్టి ప్రభాకర్,
మండల వ్యవసాయాధికారి, రాయవరం